


telangana chowrastha.com
epaper.telanganachowrastha.com

# తెలంగాణ చౌరస్తా

Voice Of Democracy

సంపుటి: 01 సంచిక:305

24 క్యారెట్లు 1,54,950.00 | కిలో వెండి 2,55,000.00 | CHOWRASTHA DIGITALS | 03.05.2026 గురువారం, హైదరాబాద్

## చావనైనా చస్తాం కానీ భావ ప్రకటనా స్వేచ్ఛను వదులుకోం

- మీరేం చేసినా నన్ను భయపెట్టలేరు
- కనీసం ముందస్తు బెయిల్ కూడా వెళ్లను
- నా మాటల్లో కులం, ప్రాంతం ప్రస్తావన లేదు
- అనవసరంగా పవన్ కళ్యాణ్ నాపై ఆరోపణలు చేస్తుండు
- నేను దేనికైనా సిద్ధం
- మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్
- ఆంధ్రా పెత్తందారీతనంపై పోరాటం కొనసాగిస్తాం
- క్రాంతి దల్ ఫౌండర్ పృథ్వీరాజ్



**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

చావనైనా చస్తాం.. కానీ భావ ప్రకటనా స్వేచ్ఛను వదులుకోబోమని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ స్పష్టం చేశారు. బుధవారం తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షులు పృధ్వీరాజ్ అధ్యక్షతన ఇనుపబూట్లు ఇం కెంతకాలం? అని

..మిగతా 2 లో




## సీబీఎస్ఈ బోర్డుపై విశ్వసనీయత సంక్షోభం

- బోర్డు డిజిటల్ మూల్యాంకన సంస్కరణలపై తీవ్ర ఆందోళనలు
- భారీ వివాదానికి దారితీసిన ఓఎస్ఎం మూల్యాంకనం
- తారుమారైన ఆన్సర్ షీట్లు, క్రాష్ అయిన పోర్టల్లు
- భారీ ఫీజులు, హ్యాకింగ్ ఆరోపణలు
- ఇప్పుడు పరీక్ష ఫలితాలపై అనుమానాలు
- మోడీ సర్కారు 'డిజిటల్ ఇండియా' నినాదం ఇదేనా?
- విద్యావేత్తలు, నిపుణుల విమర్శలు
- రెండేండ్లు కష్టపడి చదివాం
- చివరికి బ్లర్ స్కాన్ ఆధారంగా మా భవిష్యత్తు నిర్ణయిస్తుంది
- విద్యార్థులు సోషల్ మీడియాలో ఆవేదన

2



## తెలంగాణలో అకాల వర్షాలు

# తడిసిన ధాన్యం

## రైతును నిండా ముంచిన అకాల వర్షం

పలు కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యం బస్తాలు

ఆరబెట్టిన పంట ఆగమవడంతో లబోదిబోమంటున్న రైతులు

చేతికొచ్చిన పంట చేజారడంతో కన్నీరుమున్నీరైన అన్నదాత

తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలి

రైతుల డిమాండ్

తెలంగాణ రాష్ట్రంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు బీభత్సాన్ని సృష్టించాయి. ఒక్కసారిగా కురిసిన వర్షా నికి రైతుల బతుకులు అతలాకుతలం అయ్యాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షా లు అన్నదాతకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న, ధాన్యం తడిసి నీటిపాలయ్యింది. కన్న బిడ్డలా కాపాడుకున్న పంట అమ్మకం కోసం నిరీక్షిస్తున్న రైతుకు చివరాఖరికి కన్నీరే మిగిలింది.

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు బీభత్సాన్ని సృష్టించాయి. ఒక్కసారిగా కురిసిన వర్షా నికి రైతుల బతుకులు అతలాకుతలం అయ్యాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షాలు అన్నదాతకు తీరని నష్టా న్ని మిగిల్చాయి. కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న, ధాన్యం తడిసి నీటిపాలయ్యింది. కన్న బిడ్డలా కాపాడు కున్న పంట అమ్మకం కోసం నిరీక్షిస్తున్నరైతుకు చివరా ఖరికి కన్నీరే మిగిలింది. సిద్దిపేట జిల్లాలో అకాల

..మిగతా 2 లో

## నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు

- ఈదురుగాలులతో కూడిన వర్షా లు కురిసే అవకాశం
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ
- ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం


2



## బండి భగీరథ్ కేసులో సీన్ రీకన్ స్ట్రక్షన్

- మొయినాబాద్ అరణ్య ఫామ్ హౌస్ కు తీసుకెళ్లిన పోలీసులు
- అక్కడే భగీరథ్ విచారణ
- అనంతరం పేట్ బషీరాబాద్ పీఎస్‌కు తరలింపు

2



## ఇన్సురెన్స్ డబ్బుల కోసం దారుణం

- సుపారీ ఇచ్చి మరీ భర్తను హత్య చేయించిన భార్య
- మంచిర్యాల జిల్లాలో ఘోరఘటన వెలుగులోకి



2

## గాంధీభవన్‌లో కొట్టుకున్న నేతలు

- మంత్రుల ఎదుటే హైదరాబాద్ నియోజకవర్గ లీడర్ల తన్నులాట
- కోపంతో వెళ్లిపోయిన అజారుద్దీన్




2



## కర్ణాటక నూతన సీఎంగా డీకే శివకుమార్

- మే30న ప్రమాణ స్వీకారం
- గురువారం సిద్ధరామయ్య రాజీనామా
- అదే రోజు గవర్నర్ అపాయింట్మెంట్ కోరిన సిద్ధరామయ్య
- సిద్ధరామయ్య రాజ్యసభ సీటు ఆఫర్
- పార్టీ కేంద్ర స్థాయిలో కీలక బాధ్యతలు
- ఇంకా అధికారంగా ప్రకటించని కాంగ్రెస్ పార్టీ

2



## ఇంటర్మీడియట్ విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్‌లో వెరైటీలు

- వయస్సుకు తగిన పోషకాలు అందేలా రూపకల్పన
- 1.92 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం..
- మధ్యాహ్న భోజనం...
- బ్రేక్‌ఫాస్ట్ స్కీంకు ఏటా రూ.180 కోట్ల వ్యయం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జూన్ 12న ప్రారంభం

2

తెలంగాణ చౌరస్తా
జనరల్ న్యూస్ NEWS
28.05.2026
గురువారం,
హైదరాబాద్

# నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో కొద్ది రోజుల నుంచి పగటి పూట భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. సాయంత్ర సమయంతో మాత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కాస్త ఉపసమనాన్ని కలిగిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఒక వైపు మండుతున్న ఎండల వల్ల ప్రజలు వడదెబ్బకు గురవుతుంటే, మరోవైపు అకాల వర్షాల కారణంగా చేతికి వచ్చిన పంటలు నేలపాలై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో వాతావరణం పరిస్థితులు ఎలా ఉండనున్నాయో అని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి వానలు బీభత్సాన్ని సృష్టించాయి. వరుణుడు దాటికి రైతుల బతుకులు అతలాకుతలం అయ్యాయి. తెలంగాణ రాష్ట్రంలో అనేక చోట్ల వడగండ్లతో కూడిన ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. వేడిగా ఉన్న భూభాగం మీదకు తేమ గాలులు ప్రవేశించడం వల్ల అకాల వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వీటినే వేసవికాలంలో కురిసే ప్రీ మాన్‌సూన్ జల్లులంటారని పేర్కొంది. రాగల నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇవాళ ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నాయని తెలిపారు. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసినట్లు చెప్పారు. అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని వాతావరణ కేంద్రం వివరించింది. ఇవాళ, రేపు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలోని కొన్నింటికీ రెడ్ అలర్ట్ జారీ చేశామని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు వివరించారు.వేసవి కాలంలో భూభాగం బాగా వేడెక్కి 40 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నప్పుడు అదే సమయంలో విండ్ డైరెక్షన్లో మార్పులు వచ్చి తేమ గాలులు సముద్ర ప్రాంతం నుంచి భూ ప్రాంతాన్ని ప్రవేశించినప్పుడు మధ్యాహ్న సమయంలో క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడుతుంటాయని శ్రీనివాస్ రావు అన్నారు. దీంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, పిడుగుపాటు, వడగండ్ల వాతావరణం ఉంటుందని తెలిపారు. గత నాలుగైదు రోజుల నుంచి తెలంగాణలో హీట్ వేవ్ వాతావరణం ఉత్తర, తూర్పు తెలంగాణలో కొనసాగుతోంది. దక్షిణ, పశ్చిమ తెలంగాణలో చిరు జల్లుల వాతావరణం కొనసాగుతోందని వివరించారు.

# తెలంగాణలో అకాల వర్షాలు– తడిసిన ధాన్యం

▶▶ మొదటిపేజీ తరువాయి

వర్షం రైతులను తీవ్రంగా నష్టపరిచింది. మిరుదొడ్డి, తొగుట, దుబ్బాక, అక్బర్ పేట భూంపల్లి మండలాల్లో అర్ధరాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. అకాల వర్షం అన్నదాతల గుండెల్లో గుబులు రేపింది. ఆయా మండలాల్లోని ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేలాది క్వింటాళ్ల ధాన్యపు రాశులు వర్షపు నీటిలో తడిసి ముద్దయ్యాయి. తూకం వేసిన ధాన్యపు సంచులు సైతం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గజ్వేల్ నియోజకవర్గం వ్యాప్తంగా మార్కెట్ యార్డులు, రహదారులపై ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ములుగు మండలం బండతిమ్మాపూర్ లో భారీ వర్షానికి ధాన్యం, పశుసంపద నష్టపోవడంతో రైతులు ఆందోళన చెందారు. నర్సాపూర్ నియోజకవర్గం, పాపన్న పేట మండలంలోని కొనుగోలు కేంద్రాలు జలమయమై చెరువులను తలపించాయి. సంగారెడ్డి జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన వేల ధాన్యపు బస్తాలు తడిసి ముద్దయ్యాయి. సకాలంలో వడ్లు తూకం వేయకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.



అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతుల గుండెల్లో గుబులు పుట్టించింది. చొప్పదండి, రామడుగు, గంగాధర, మానకొండూరు మండలాల్లో వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం తడిసిముద్దైంది. నెల రోజులుగా విక్రయానికి ఎదురుచూస్తున్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లి మార్కెట్లో అమ్మకానికి తెచ్చిన మొక్కజొన్న, ధాన్యం తడిచిపోయింది. వర్షానికి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్మకానికి పోసిన మక్కలు, వరి ధాన్యం తడిసి ముద్దయ్యాయి. కుండపోత వర్షం కురవడంతో వరి ధాన్యం కుప్పల్లోకి నీరు చేరి.. కొంత ధాన్యం కొట్టుకుపోగా, మక్కల బస్తాలు సైతం తడిసిపోయాయి. మార్క్ ఫెడ్ ద్వారా నెల రోజుల క్రితం కొనుగోలు కేంద్రం ప్రారంభించగా నేటికీ మక్కలను కొనలేదని అందుకే తమకు ఈ దుస్థితి ఏర్పడిందని రైతులు ఆరోపించారు. కామారెడ్డి జిల్లాలో అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల వద్ద అరబెట్టిన ధాన్యం తడిసి ముద్దైంది. మాచారెడ్డి, కామారెడ్డి, బిక్కనూర్, దోమకొండ, బీబీపేట్ మండలాలతోపాటు రాజంపేట, తాడ్వాయి, రామారెడ్డి, సదాశివ నగర్ మండలాల్లో సైతం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కల్లాలో ఆరబెట్టిన వరి, మొక్కజొన్న, జొన్న పంటలు పూర్తిగా తడిసిపోయాయి. హమాలీల కొరత, అధికారుల అలసత్వంతో కాంటా ఆలస్యం కావడంతోనే ధాన్యం తడిసి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేసి ఉంటే ఇలాంటి నష్టం జరిగేది కాదని వాపోతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి, తెలకపల్లి, తాడూరు, తిమ్మాజిపేట మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దయింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మార్కెట్ లో ఆరబెట్టి సంచుల్లో నింపిన మొక్కజొన్న, ధాన్యం తడిసిపోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. అకాల వర్షాలు పడుతున్న ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

రెండు మూడు వారాలుగా కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నా ధాన్యం కొనకుండా ఇప్పుడు నష్టాలపాలు చేశారని రైతులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

# చావనైనా చస్తాం కానీ భావ ప్రకటనా స్వేచ్ఛను వదులుకోం

▶▶ మొదటిపేజీ తరువాయి

ప్రశ్నిస్తూ హైదరాబాద్ లోని సోమాజీగూడ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగేశ్వర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ హరించడం సరికాదన్నారు. తాను భయపడే ప్రసక్తే లేదనీ, ఇప్పటి వరకు యాంటీసిపేటరీ బెయిల్ కోసం వెళ్లలేదనీ, వెళ్లబోనని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తన ఇంటికి అరెస్ట్ చేసేందుకు ఎవరు రాలేదని తెలిపారు. తన మాటల్లో కులం, ప్రాంతం ప్రస్తావన లేకుండా తాను కులచిచ్చు పెట్టడానికి ప్రయత్నించానని ఆరోపించారని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాటల్లోనే కులం, ప్రాంతం ప్రస్తావన తెచ్చారని తెలిపారు. ప్రజా జీవితాన్ని అల్లకల్లోలం చేశానని ఆరోపణలు తనపై మోపారనీ, పదాలకు, ప్రకటనలకు వర్తించని సెక్షన్లు పెట్టి నవ్వు తెప్పించేలా కేసు నమోదు చేశారని తీసిపారేశారు. తాను ఆంధ్రప్రదేశ్ గురించే కాదు... ప్రపంచంలోని అనేక దేశాలు, ప్రాంతాల గురించి మాట్లాడుతున్నానని గుర్తుచేశారు. ఆదాయం వచ్చే రైల్వే లైన్ తీసేసి విశాఖ పట్నం రైల్వే జోన్ ఇస్తే, పామర్రులో ఓఎన్జీసీ విలువైన ఆయిల్ నిక్షేపాలను కనుగొంటే దుర్మార్గ చరిత్ర కలిగిన వేదాంతకు అప్పగిస్తే ఏపీలో ఏ ఒక్క పార్టీ అడగలేదని తప్పుపట్టారు. ఇలాంటి వంద ఉదాహరణలు తాను చెప్పగలనని అన్నారు. తనను అరెస్ట్ చేస్తారో లేక కేసులు ఉపసంహరించుకుంటారో? చేయరో? వారి ఇష్టమని తెలిపారు. దేనికైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఎంత బెదిరిస్తే అంత ఎక్కువగా మాట్లాడుతానని హెచ్చరించారు. అరెస్ట్ చేసేందుకు వస్తామంటే ఎప్పుడొస్తారో చెప్పాలని సవాల్ విసిరారు.

ఆంధ్రా పెత్తందారీతనంపై పోరాటం కొనసాగిస్తాం

తెలంగాణలో ఆంధ్రా పెత్తందారీతనంపై తమ పోరాటం కొనసాగుతుందని పృథ్వీరాజ్ స్పష్టం చేశారు. తెలంగాణ మేధావులపై దాడి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రెండు కండ్ల సిద్ధాంతాలను, ధృతరాష్ట్ర కౌగిలిలను నమ్మే ప్రసక్తే లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ పాలకులకు శని, ఆదివారాల్లో హైదరాబాద్ లో ఏం పని ఉంటుంది? అని ప్రశ్నించారు. అక్కడి ప్రజలు ఎన్నుకున్నది సేవ చేయడానికని గుర్తుచేశారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ పై టీడీపీ, జన సేన దుష్ప్రచారాన్ని ఆపాలనీ, హెరిటేజ్ ఉత్పత్తులను బహిష్కరించాలనీ, సోర్స్ ను అడగొద్దనీ, టీడీపీ హ్యాండిల్ లో నాగేశ్వర్ పై పెట్టిన పోస్ట్ ను వెనక్కి తీసుకోవాలనీ, ఆయనపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలనీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియా సంస్థలపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలను సమావేశం ఆమోదించింది. ఈ సమావేశంలో సంధ్య (పీఓడబ్ల్యూ), సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, సీనియర్ జర్నలిస్ట్ తులసి చందు, ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు కంభాలపల్లి కృష్ణ, జర్నలిస్టులు కాళోజీ శ్రీను, మన తొలివెలుగు రఘు తదితరులు మాట్లాడారు.

# బండి భగీరథ్ కేసులో సీన్ రీకన్ స్ట్రక్షన్

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

లైంగికదాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసులో పోలీసులు బుధవారం సీన్ రీకన్ స్ట్రక్షన్ చేశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని అరణ్య ఫామ్ హౌజ్ కు భగీరథ్ ను తీసుకెళ్లారు. అక్కడే కొద్ది సేపు విచారించారు. అనంతరం మళ్లీ పేట్ బషీరాబాద్ పీఎస్ కు తరలించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలికపై లైంగికదాడి కేసులో బండి భగీరథ్ కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. భగీరథ్ ను మూడ్రోజుల పోలీసు కస్టడీకి ఇస్తూ మల్కాజ్‌గిరి కోర్టు తీర్పు వెల్లడించింది. బుధవారం ఉదయం భగీరథ్ ను జైలు నుంచి పోలీసులు భారీ భద్రత మధ్య మేడ్చల్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మొయినాబాద్ లోని ఫామ్ హౌజ్ కు తరలించారు. అక్కడ అతన్ని పలు ప్రశ్నలు అడిగి, కేసుకు సంబంధించిన కీలక విషయాలు రాబట్టే ప్రయత్నం చేశారు. బాలిక, ఆమె తల్లి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా పోలీసులు భగీరథ్‌పై ప్రశ్నలు సంధించారు. ఘటన ఎక్కడెక్కడ జరిగింది? ఎవరెవరు సహకరించారు? అనే కోణంలో విచారించారు. ఈ దర్యాప్తు మొత్తం కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగింది. విచారణ అనంతరం భగీరథ్ ను పీఎస్ కు తరలించారు.



# గాంధీభవన్‌లో కొట్టుకున్న నేతలు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

గాంధీభవన్‌లో మంత్రుల ఎదుటే ఇద్దరు కాంగ్రెస్ నేతలు చొక్కాలు పట్టుకొని కొట్టుకోవడంతో రచ్చరచ్చ అయ్యింది. గాంధీభవన్‌లో బుధవారం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతల సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రి అజారుద్దీన్ పక్కన కూర్చునే విషయమై కార్వాన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ అల్ హాజ్రీ, నాంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఫిరోజ్‌ఖాన్ మధ్య గొడవ మొదలైంది. మంత్రులు అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్ ఎదుటే ఇద్దరూ చొక్కాలు పట్టుకొని కొట్టుకొన్నారు. సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు వీ హనుమంతరావును సైతం తోసేందుకు ప్రయత్నించగా మిగతా నేతలు అడ్డుకొన్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అజారుద్దీన్ కోపంతో అక్కడినుంచి వెళ్లిపోయారు. దీంతో సమావేశాన్ని రద్దు చేస్తున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. తమది కాంగ్రెస్ ఫ్యామిలీ అని, ఫ్యామిలీలో గొడవలు సహజమని ఉస్మాన్, ఫిరోజ్‌ఖాన్ అన్నారు.

# ఇన్సురెన్స్ డబ్బుల కోసం దారుణం

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

వివాహేతర సంబంధం కొనసాగించడం, రూ.2 కోట్ల బీమా సొమ్ము కోసం భార్యే సుపారీ ఇచ్చి భర్తను హత్య చేయించిన ఘటన మంచిర్యాల జిల్లాలో కలకలం రేపింది. మంచిర్యాల డీసీపీ భాస్కర్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడి పేటకు చెందిన సాయిని కుమార్ (45) తన మోటార్ సైకిల్ పై ఈ నెల 22న మంచిర్యాల వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు 108లో కరీంనగర్ కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు.ప్రమాదంపై అనుమానం ఉండటంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. అయితే సాయిని కుమార్ భార్య భారతికి గుడిపేటకు చెందిన లగిశెట్టి సురేందర్ కు వివాహేతర సంబంధం ఉంది. తమ మధ్య ఉన్న బంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని అతడిని హత్య చేయాలని ఇద్దరు భావించారు. 2025 జనవరి నుంచే భర్త పేరిట ఎల్.ఐ.సీ.తో పాటు పలు బీమా సంస్థలలో ప్రీమియంలు చెల్లిస్తూ వస్తుంది. కుమార్ రోడ్డు ప్రమాదంలో చనిపోతే సుమారు రూ.2 కోట్ల వరకు వస్తుందని వారి అంచనా. కుమార్ గుడిపేటకు చెందిన రామ్ మల్లేశ్ వద్ద రూ.60వేలు అప్పుగా తీసుకొని చెల్లించకపోవడంతో ఇంటికి వెళ్లి గొడవ చేసేవాడు. ఈ క్రమంలో మల్లేష్‌కుమార్ భార్య భారతితో పరిచయం ఏర్పడింది.తన భర్తను హత్య చేస్తే రూ. 10లక్షల సుపారీ ఇస్తానని గత నెలలో రూ.2లక్షలు మల్లేష్ కు భారతి, సురేందర్ చెల్లించారు. తాను ఒక్కడే ఈ హత్య చేయలేనని మంచిర్యాలలోని ఎల్.ఐ.సీ కాలనీకి చెందిన శ్రీరామ్ తో జతకూడాడు. పథకం ప్రకారం ఈ నెల 22న ముల్కల్ల గ్రామ శివారులో రామ్ మల్లేశ్, శ్రీరామ్ లు, కుమార్ కు అతిగా మద్యం తాగించి ఇనుప సుత్తితో తలపై బలంగా కొట్టి గాయపరిచారు. అనంతరం రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు కుమార్ తో పాటు అతడి మోటార్ సైకిల్ ను రోడ్డు పక్కన పడేసి పరారయ్యారు.అయితే తన కుమారుడి మృతిపై రామ్ మల్లేష్ పై అనుమానం ఉన్నట్లు కుమార్ తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. భారతి వ్యవహారశైలి.. సురేందర్ కు ఆమెకు ఉన్న వివాహేతర సంబంధం పోలీసుల అనుమానాలను బలపరచాయి. మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ పర్యవేక్షణలో మంచిర్యాల గ్రామీణ సీఐ రవీందర్ లు క్షేత్రస్థాయిలో కేసు దర్యాప్తు చేసి రోడ్డు ప్రమాదాన్ని హత్యగా ఛేదించారు. నిందితుల నుంచి ప్రీమియంకు సంబంధించిన పత్రాలతో పాటు రూ.25వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులైన భారతి, సురేందర్, శ్రీరామ్ లను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. అయితే ఈ కేసులో ఉన్న రామ్ మల్లేశ్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే అతడిని పట్టుకుంటామన్నారు.



# కర్ణాటక నూతన సీఎంగా డీకే శివకుమార్

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

కర్ణాటకలో నాయకత్వ మార్పు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. మంగళవారం దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమావేశమైన తర్వాత పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. సీఎం సిద్ధరామయ్య గురువారం రాజీనామా చేస్తారని విస్తృత ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సిద్దరామయ్య గురువారం గవర్నర్‌ను సమయం కోరడం, నాయకత్వ మార్పుపై అప్పుడే మాట్లాడతానని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా మే 30న కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు కాంగ్రెస్ వర్గాల సమాచారం.

మంగళవారం దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో జరిగిన భేటీలో నాయకత్వ మార్పుపై అసలు చర్చే జరగలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పష్టంగా చెప్పినప్పటికీ మార్పు దిశగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్దరామయ్య గురువారం కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ అపాయింట్‌మెంట్ కోరినట్లు సీఎంఓ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం సిద్ధరామయ్య తన రాజీనామాను గవర్నర్ గెహ్లోత్‌కు సమర్పించే అవకాశం ఉంది. సిద్ధరామయ్య తన అధికారిక నివాసం 'కావేరి'లో గురువారం ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఇతర మంత్రివర్గ సహచరులతో అల్పాహార సమావేశం నిర్వహించనున్నారు. మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా బెంగళూరులోని విధాన సౌధలో ఆయనకు సీఎం నివాళులు అర్పించారు. తర్వాత సీఎం మార్పునకు సంబంధించి అడిగిన ప్రశ్నలపై గురువారమే మాట్లాడతానని సిద్దరామయ్య చెప్పారు.

దిల్లీలో మంగళవారం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు సిద్ధరామయ్య, శివకుమార్‌లతో విడివిడిగా సమావేశయ్యారు. వారితో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పదవి నుంచి తప్పుకోవాలని సిద్ధరామయ్యను అధిష్ఠానం కోరినట్లు సమాచారం. సిద్ధరామయ్యకు రాజ్యసభ స్థానం, కేంద్ర స్థాయిలో కీలక పాత్ర ఇవ్వజూపినట్లు వచ్చాయి. అయితే రాజ్యసభ ఎన్నికలు, కర్ణాటక శాసనమండలి ఎన్నికల గురించే చర్చించినట్లు సమావేశం తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చెప్పారు. నాయకత్వ మార్పు గురించి కాదని చెప్పారు. గతేడాది కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నప్పటి నుంచి నాయకత్వ మార్పుపై ఊహాగానాలు మొదలయ్యాయి. గత 18 నెలలుగా డీకే శివకుమార్ అనుచరులు ఆయన ముఖ్యమంత్రి బాధ్యతలు చేపడతారని చెబుతున్నారు. ఇదేసమయంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు సీనియర్ కాంగ్రెస్ నేత జి. పరమేశ్వరకు సీఎంగా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్ కర్ణాటక వ్యవహారాల బాధ్యుడు రణదీప్ సూర్జేవాలా బెంగళూరులో కాంగ్రెస్ నాయకులతో సమావేశమై నాయకత్వ మార్పుపై స్పష్టత ఇచ్చే అవకాశముందని సమాచారం. మూడేళ్లుగా కర్ణాటకలో ప్రభుత్వం సుపరిపాలన అందించడంలో విఫలమైనట్లు అర్థం చేసుకుని సీఎం సిద్ధరామయ్యను మార్చాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుందని బీజేపీ విమర్శించింది. తదుపరి ముఖ్యమంత్రి ఎవరైనప్పటికీ రాష్ట్రంలో మధ్యంతర ఎన్నికలు జరుగుతాయని, దీన్ని ఎవరూ ఆపలేరని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర జోస్యం చెప్పారు. శివమొగ్గలో విలేకరుల మాట్లాడిన విజయేంద్ర అసలు సమస్య సీఎం ఎవరు అవుతారనేది కాదని రాష్ట్ర పరిపాలన గురించి అని అన్నారు. రాష్ట్రంలో అంతర్గత కలహాల కారణంగా పరిపాలన పూర్తిగా కుప్పకూలిందని ఆరోపించారు. సిద్ధరామయ్య హయాంలో వాల్మీకి డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ముడా సైట్ కేటాయింపుల వంటి కోట్లాది రూపాయల కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే, సిద్ధరామయ్య రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని మండిపడ్డారు.

# సీబీఎస్ఈ బోర్డుపై విశ్వసనీయత సంక్షోభం

**న్యూఢిల్లీ, తెలంగాణ చౌరస్తా :**

ఈ ఏడాది సీబీఎస్ఈ చేపట్టిన డిజిటల్ మూల్యాంకన సంస్కరణలు విద్యార్థులకు ఉపశమనం ఇవ్వాల్సింది పోయి తీవ్ర ఆందోళనకు కారణమయ్యాయి. పరీక్ష ఫలితాలపై అనుమానాలు, సాంకేతిక లోపాలు, సమాధాన పత్రాల గందరగోళం, పోర్టల్ వైఫల్యాలతో దేశంలోనే అతిపెద్ద విద్యాబోర్డు ఇప్పుడు విశ్వసనీయత సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గత కొన్నేండ్లుగా 'డిజిటల్ ఇండియా' అనే నినాదాలను పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ వచ్చింది. కానీ సీబీఎస్ఈలో చోటుచేసుకున్న పరిణామాలు ఆ ప్రచారాల అసలు స్థితిని బయటపెట్టాయని విద్యా నిపుణులు విమర్శిస్తున్నారు. 2026ను డిజిటల్ ఆధునీకరణ సంవత్సరంగా మార్చాలని భావించిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ).. ఇప్పుడు తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. ఈ ఏడాది మొదటిసారిగా క్లాస్ 12 బోర్డ్ పరీక్షల కోసం 'ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం)' వ్యవస్థను అమలు చేసింది. దాదాపు 98.66 లక్షల ఆన్సర్ షీట్లను స్కాన్ చేసి, దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 70 వేల మంది ఎగ్జామినర్లు ఆన్‌లైన్ ద్వారా మూల్యాంకనం చేశారు. వాస్తవానికి ఈ విధానం వేగవంతమైన మూల్యాంకనం, తక్కువ మానవ తప్పిదాలు, అధిక పారదర్శకతను తీసుకురావాల్సింది. కానీ ఫలితాలు ప్రకటించిన వెంటనే పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ఈసారి క్లాస్ 12 ఉత్తీర్ణత శాతం 85.2 శాతానికి పడిపోయింది. గతేడాది ఇది 88.39 శాతంతో పోలిస్తే గణనీయమైన తగ్గుదల కావడం గమనార్హం. దీంతో వెంటనే సోషల్ మీడియాలో విద్యార్థుల అసంతృప్తి వెల్లువెత్తింది. ముఖ్యంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథ్స్ వంటి సబ్జెక్టుల్లో అనూహ్యంగా తక్కువ మార్కులు వచ్చాయని వేలాది మంది విద్యార్థులు ఆరోపించారు. మొదట ఇది సాధారణ 'ఫలితాల అసంతృప్తి'గా కనిపించినా... తర్వాత పరిస్థితి మరింత తీవ్రమైంది.

**అసలు సమస్య ఎక్కడ మొదలైంది?**

చాలా మంది విద్యార్థులు తమ సమాధానాలు సరిగా పరిశీలించలేదని, స్కాన్ చేసిన ఆన్సర్ షీట్లు బ్లర్‌గా ఉన్నాయని ఫిర్యాదు చేశారు. "రెండేండ్లు కష్టపడి చదివాం. చివరికి బ్లర్ స్కాన్ ఆధారంగా మా భవిష్యత్తు నిర్ణయించబడుతోంది" అంటూ విద్యార్థులు సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఒత్తిడిని తగ్గించేందుకు సీబీఎస్ఈ ఈ సారి ఒక కొత్త గ్రీవెన్స్ విధానాన్ని ప్రకటించింది. విద్యార్థులు ముందుగా తమ స్కాన్ చేసిన ఆన్సర్ షీట్లను పొందిన తర్వాతే రీవెరిఫికేషన్ లేదా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. కానీ ఇదే మరో సంక్షోభానికి దారితీసింది.

రికార్డు స్థాయిలో □స్కాన్ కాపీల కోసం దరఖాస్తులు ఈసారి దాదాపు ప్రతి నలుగురిలో ఒకరు తమ ఆన్సర్ షీట్ల కాపీల కోసం దరఖాస్తు చేసినట్టు సమాచారం. ఇది కేవలం మార్కుల అసంతృప్తి కాదనీ, బోర్డు మూల్యాంకనంపై విద్యార్థుల నమ్మకం దెబ్బతిన్నదనే సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక వేల సంఖ్యలో దరఖాస్తులు రావడంతో సీబీఎస్ఈ పోర్టల్ వరుసగా క్రాష్ అయింది. పేమెంట్లు ఫెయిల్ కావడం, అప్లికేషన్లు మధ్యలో నిలిచిపోవడం, కొందరికి ఒకే ఫీజు పలుమార్లు కట్ కావడం వంటి సమస్యలు ఎదురయ్యాయి.

**తారుమారైన ఆన్సర్ షీట్ ఘటన**

ఈ ఆ21 ఒక ఘటన కీలకంగా మారింది. క్లాస్ 12 విద్యార్థి వేదాంత్ తన ఫిజిక్స్ ఆన్సర్ షీట్ స్థానంలో మరో విద్యార్థి సమాధాన పత్రం తన రోల్ నంబర్‌కు అప్‌లోడ్ అయిందని ఆరోపించాడు. ఈ విషయం వైరల్ కావడంతో సీబీఎస్ఈ విచారణ జరిపి తప్పు జరిగిందని అంగీకరించింది. తర్వాత సరైన ఆన్సర్ షీట్‌ను అప్‌లోడ్ చేసింది. ఈ ఘటనతో విద్యార్థుల్లో భయం మరింత పెరిగింది.

**హ్యాకింగ్ ఆరోపణలతో కలకలం**

ఓ విద్యార్థి తనను 'ఎథికల్ హ్యాకర్'గా పేర్కొంటూ చేసిన ప్రకటనలు కలకలం సృష్టించాయి. కేవలం 30 నిమిషాల్లో సీబీఎస్ఈ మూల్యాంకన వ్యవస్థలోకి ప్రవేశించానని ఆయన చెప్పాడు. ఎగ్జామినర్ స్థాయి ఫంక్షన్లను యాక్సెస్ చేయగలిగానని, మూల్యాంకన వివరాలను మార్చగలిగానని ఆయన పేర్కొన్నాడు. అయితే సీబీఎస్ఈ ఈ ఆరోపణలను ఖండించింది. కేవలం టెస్టింగ్ వాతావరణం మాత్రమే ప్రభావితమైందని స్పష్టం చేసింది. అయినప్పటికీ.. విద్యార్థుల్లో అనుమానాలు మాత్రం తగ్గలేదు. ఇక ఈ మొత్తం వివాదంలో హైదరాబాద్‌కు చెందిన 'కోఎంప్ట్ ఎడ్యూటెక్' అనే సంస్థ పేరు కూడా చర్చకు వచ్చింది. డిజిటల్ మూల్యాంకన వ్యవస్థలో భాగస్వామ్యంగా పనిచేసిన ఈ సంస్థపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వచ్చాయి. అయితే ఇప్పటివరకు ఆ సంస్థపై అధికారికంగా ఎలాంటి తప్పిదమూ నిర్ధారణ కాలేదు. కానీ దేశంలోనే అతిపెద్ద విద్యా బోర్డు ఇంత పెద్ద స్థాయిలో డిజిటల్ మార్పునకు నిజంగా సిద్ధంగా ఉందా? అనే ప్రశ్నలు మాత్రం సర్వత్రా కొనసాగుతున్నాయి.

# ఇంటర్మీడియట్ విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ లో వెరైటీలు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

దోశ... పూరి.. మిల్లెట్ ఇడ్లీ... బోండా .. ఉప్మా.. ఇవి హోటల్ మెనూ కాదు.... ఇంటర్మీడియట్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న బ్రేక్ ఫాస్ట్. చట్నీ, సాంబర్, మిక్స్‌డ్ వెజిటబుల్ కుర్మాతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు రుచికరమైన, పోషకాలతో కూడిన బ్రేక్ ఫాస్ట్ అందనుంది. కీలకమైన ఇంటర్మీడియట్ దశలో విద్యార్థులకు నాణ్యతతో కూడిన బలవర్ధక ఆహారం అందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంకల్పించడంతో ఇంటర్ విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమవుతోంది. ఇప్పటి వరకు దేశంలో పాఠశాల విద్యార్థులకే మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. కళాశాల విద్యార్థులకు ఏ రాష్ట్రంలోనూ మధ్యాహ్న భోజన పథకం అమల్లో లేదు. కానీ రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజనం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఫలితంగా దేశంలోనే తొలిసారి ఇంటర్మీడియట్ విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందించనున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలవనుంది. పెద్ద గ్రామాలు, మండల కేంద్రాల్లో ఉన్నత పాఠశాలలు ఉండడంతో విద్యార్థులు పదో తరగతి వరకు ఎటువంటి ఆటంకం లేకుండా విద్యాభ్యాసం చేస్తున్నారు. జూనియర్ కళాశాలలు మండల కేంద్రాలు, ఆపై స్థాయి పట్టణాలు, నగరాల్లోనే ఉండడంతో గ్రామాలు, తండాలు, ఆదివాసీ గూడాల నుంచి విద్యార్థులు కళాశాలలకు వెళ్లడం కష్టమవుతోంది. ఉదయం సమయానికి బ్రేక్‌ఫాస్ట్ చేసే పరిస్థితి లేకపోవడం, బ్రేక్‌ఫాస్ట్ చేసినా మధ్యాహ్న భోజనం తీసుకెళ్లేందుకు సమయం లేకపోవడంతో అర్ధాకలితో విద్యార్థులు ఇబ్బంది పడేవారు. ఈ క్రమంలోనే చాలా మంది కళాశాల విద్యకు దూరమవుతున్నారు. దానికి తోడు ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అత్యధికులు బలహీనవర్గాలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారే. ఆయా కుటుంబాల్లోని ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పదో తరగతి తర్వాత చదువు మానేసి పనులకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో పదో తరగతి పూర్తి చేసిన ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ఇంటర్మీడియట్ విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నారు.

**తొలి రోజు 64 కళాశాలల్లో....**

ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్, 12వ తేదీన ప్రారంభిస్తారు.. తొలి రోజు 41,250 మంది విద్యార్థులు ఈ పథకంలో భాగస్వాములవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తి స్థాయిలో తరగతులు ప్రారంభమైన తర్వాత ఫస్టియర్, సెకండియర్ కలిపి రోజుకు 1.92 లక్షల మంది బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం చేయనున్నారు.. ఇంటర్మీయట్ విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌కు రూ.80 కోట్లు, మధ్యాహ్న భోజనానికి రూ.100 కోట్లను వెచ్చించనున్నారు..ఈ మొత్తాన్ని విద్యార్థులపై చేసే వ్యయంగా కాకుండా భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుత బ్రేక్ ఫాస్ట్ మెనూలో మరింత పోషకాలు అందించే వివిధ పదార్థాలను పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం నిర్ణయించిన బ్రేక్ ఫాస్ట్ మెనూ ఈ విధంగా ఉంది.

**రోజు.... మెనూ..**

**తొలి రోజు... దోశ+చట్నీ**

**రెండో రోజు.... మిల్లెట్ ఇడ్లీ+సాంబార్**

**మూడో రోజు... పూరీ+మిక్స్‌డ్ వెజిటెబుల్ కుర్మా**

**నాలుగో రోజు... బోండా+చట్నీ**

**అయిదో రోజు... ఇడ్లీ+చట్నీ**

**ఆరో రోజు.... ఉప్మా+చట్నీ/ సాంబార్**

**రోజు విడిచి రోజు 150 ఎం.ఎల్. పాలు**





- బీఆర్ఎస్ హయాంలో మోసం కాంగ్రెస్ హయాంలో ఇళ్ల పంపిణీ
- ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్న కేటీఆర్.
- కేటీఆర్‌పై మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఫైర్
- బోడుప్పల్‌లో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలించిన మాజీ మేయర్,మాజీ కార్పోరేటర్లు

# పేదల ఇళ్లపై రాజకీయం



**బోడుప్పల్ తెలంగాణ చౌరస్తా:**

మాజీ మంత్రి కేటీఆర్ ఇందిరమ్మ ఇండ్లపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ప్రజలను తప్పుదారి పట్టించేలా ఉన్నాయని బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ గారు మండిపడ్డారు. మంగళవారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మేడ్చల్ జిల్లా బీబ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ గారు, మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్ గారు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా అజయ్ యాదవ్ గారు మాట్లాడుతూ... "పేదలకు ఇళ్లు ఇస్తుంటే కేటీఆర్‌కు ఎందుకు ఇంత కడుపుమంటో ప్రజలకు అర్థం కావడం లేదు. బీఆర్ఎస్ పాలనలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు పేరుతో మోసం చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తుంటే వాటిపై విమర్శలు చేయడం దౌర్భాగ్యం. ప్రజల సమస్యలు చూడకుండా రాజకీయ విమర్శలతో కాలక్షేపం చేయడం కేటీఆర్‌కు అలవాటైపోయింది" అని ఘాటుగా విమర్శించారు.

"బీఆర్ఎస్ హయాంలో వేలాది మంది పేదలు ఇళ్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా ఇండ్ల కేటాయింపులు చేస్తోంది. పేదల ఆనందాన్ని కూడా జీర్ణించుకోలేక కేటీఆర్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటి సభ్యులు మరాటి మల్లేష్, దయ్యాల అలివేలు, రాహుల్, యువజన నాయకులు అసర్ల బీరప్ప, జన్నె రాజు, అంబాల అరవింద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రొ. నాగేశ్వరరావుపై కేసులు పెడితే ఖబడ్దార్

- డాక్టర్. ప్రేమ్ కుమార్

**సికింద్రాబాద్, తెలంగాణ చౌరస్తా:**



రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వరరావు పై కేసులు, దాడులు చేస్తే తిరగబడతామని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ ఒక ప్రకటన లో హెచ్చరించారు. ప్రొఫెసర్ నాగేశ్వరరావు జనసేన నాయకులు పవన్ కళ్యాణ్, జన సేన పార్టీ కార్యకర్తలు మాటలతో దాడి చెయ్యడం, కేసులు పెట్టడం మానుకోవాలని హెచ్చరించారు. ప్రొఫెసర్ నాగేశ్వరరావు వ్యక్తిత్వానికి పవన్ కల్యాణ్ అనే వ్యక్తి సరితుగాలేదని అలాంటి వ్యక్తి ప్రో. నాగేశ్వరరావు పై కేసులు పెట్టడం సరైనది కాదని అన్నారు. వాక్ స్వతంత్రం ప్రకారం రాజకీయలలో ఉన్న పవన్ కళ్యాణ్ విమర్శించడం ప్రశ్నించడం తమ హక్కు అని అలా ప్రశ్నించిన వారి అందరినీ కేసులు పెట్టడం, దాడులు చెయ్యడం మానుకోవాలని హితవు పలికారు. ప్రో. నాగేశ్వరరావు జ్ఞానం, శీలం ముందు పవన్ కళ్యాణ్ ఏమాత్రం పనికి రాడని అలాంటి పవన్ కళ్యాణ్ ప్రో. నాగేశ్వరరావు జోలికి వస్తే తగిన గుణ పాఠం చెప్తామని. ఇకనైనా ప్రొఫెసర్ నాగేశ్వరరావు పై దాడులు, కేసులు పెట్టడం మానుకోవాలని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ హెచ్చరించారు.



# సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలి

- జిల్లా వైద్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :**

ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాల (కాన్పుల) శాతాన్ని పెంచేందుకు వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆదేశించారు. జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, గర్భిణీల నమోదు పుస్తకాలు, రోగ నిరోధక టీకాల కార్యక్రమ అమలు తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గర్భిణీలకు ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ప్రతి గర్భిణికి కనీసం నాలుగు సార్లు వైద్య పరీక్షలు నిర్వహించి, రక్తపోటు, మధుమేహం, రక్తహీనత పరీక్షలు తప్పనిసరిగా చేయాలని స్పష్టం చేశారు. గర్భిణీలు ఇనుము, సున్నపురాయి మాత్రలు క్రమం తప్పకుండా తీసుకునేలా చూడాలని, పోషకాహారం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని వివరించారు. తల్లి, శిశు మరణాలను తగ్గించేందుకు ప్రమాద అంచున ఉన్న గర్భిణీలను ముందుగానే గుర్తించి ప్రత్యేక చికిత్స అందించాలని పేర్కొన్నారు. ఎండ తీవ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలిప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా ప్రజలను చైతన్యపరచాలని డాక్టర్ తుకారాం రాథోడ్ సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, తగినంత నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, ఉప్పుచక్కెర ద్రావణాలు తీసుకోవాలని ప్రజలకు వివరించాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు.

**సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత**

దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి చలిజ్వరాల నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వారానికి ఒకరోజు పొడి దినం (డ్రై డే) పాటించాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించేలా అవగాహన కల్పించాలన్నారు.

**పోలియో నివారణకు ముందస్తు ప్రణాళిక**

వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రతి చిన్నారికి సమయానికి టీకాలు అందించాలని ఆదేశించారు. రాబోయే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావడానికి ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసి, ఐదేళ్ల లోపు పిల్లల జాబితాను తయారు చేయాలన్నారు. ఒక్క చిన్నారి కూడా విడిచిపోకుండా ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల లోపు పిల్లల సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రజలు పరిశుభ్రత పాటించడం, మరుగుదొడ్లు వినియోగించడం, చేతులు సబ్బుతో కడుక్కోవడం వంటి అలవాట్లు అలవరుచుకునేలా ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మధ్యస్థాయి ఆరోగ్య ప్రదాత వెంకటేష్, ఆరోగ్య పర్యవేక్షకురాలు రాధిక, నర్సింగ్ అధికారి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల నడ్డి విరిచేలా
# పెట్రోల్ డీజిల్ ధరల పెంపు

- పివైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య

**తెలంగాణ చౌరస్తా, సూర్యాపేట:**



కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలి పి వై ఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య డిమాండ్ చేశారు మంగళవారం నాడు మండల విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే పశ్చిమ హాస్యలో తలెత్తిన యుద్ధ మూలంగా నిత్యవసర వస్తువులు ధరలు పెరిగి పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పది రోజుల వ్యవధిలోనే నాలుగు సార్లు పెట్రోల్ డీజిల్ లీటరుకు 8 రూపాయల ధరలు చొప్పున పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం సమాజం కాదని పేర్కొన్నారు .గత కొన్ని రోజులుగా పెట్రోల్ డీజిల్ ధరలు పెరుగుతాయని ప్రజలు మొత్తుకుంటూ ఉంటే పెంచబోమని గొప్పలు చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ప్రజలపై బారాలు మోపడం దేశ ప్రజలను దగా చేయడమేనని విమర్శించారు ఈ ధరల పెంపు రవాణా వ్యవసాయ రంగాలపై ఎక్కువ ప్రభావం చూపే ప్రమాదం ఉందని తక్షణమే కేంద్ర ప్రభుత్వం ధరల పెంపు ను వెంటనే ఉపసంహరించుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు

## ఇక నుంచి నేరుగా లబ్దిదారుల
# బ్యాంక్ అకౌంట్లోకి పింఛన్

- సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు

**తెలంగాణ చౌరస్తా, హైదరాబాద్:**



పెన్షన్ల పంపిణీపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి నేరుగా పింఛన్ సొమ్మును లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లో జమ చేయనుంది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇక నుంచి ఆసరా పథకం ద్వారా లబ్ధిదారులకు ఇస్తున్న పింఛన్ నగదును అకౌంట్లో జమ చేయాలని సూచించారు. ప్రస్తుతం పోస్టల్ శాఖ ద్వారా పింఛన్లు అందిస్తుండగా. ఈ విధానంలో మార్పులు చేశారు. ఇక నుంచి నేరుగా లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. అర్హులకు మాత్రమే పింఛన్లు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డ్, సామాజిక, ఆర్థిక సర్వే నివేదికల ఆధారంగా పింఛన్లను క్రమబద్ధికరించాలని సూచించారు.











తెలంగాణ చౌరస్తా 26/05/2026 | Page No: epaper.telanganachowrasta.com

అశ్వారావుపేట బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కరవు

# తెలంగాణ చౌరస్తా' కథనానికి అదిరిపోయే రెస్పాన్స్

- బస్టాండ్‌లో ఫ్యాన్లు తాగునీటి సమస్యకు పరిష్కారం
- స్పందించిన సత్తుపల్లి డిపో మేనేజ్మెంట్
- ఆర్టీసీ అధికారులకు రిపోర్టర్ ధన్యవాదాలు

**అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా:**



తెలంగాణ చౌరస్తా Voice Of Democracy 25/05/2026 | Page No: 4 epaper.telanganachowrasta.com

నరకానికి కేరాఫ్ అడ్రస్ బస్టాండ్

- ఎమ్మెల్యే మినీ డిపో మాట దేవుడెరుగు
- కనీసం ఫ్యాన్లయినా తిరిగేలా చూడండి
- ఫ్యాన్లు తిరగవు.. కుర్చీలు నిలబడవు.
- తాగడానికి చుక్క నీరు లేదు
- అశ్వారావుపేటపై ఎందుకీ సవతి తల్లి ప్రేమ..?



అశ్వారావుపేట మేజర్ బస్టాండ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న కనీస వసతుల సమస్యలపై 'తెలంగాణ చౌరస్తా' దినపత్రికలో వచ్చిన వరుస కథనాలకు ఆర్టీసీ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. వేసవి ఎండ తీవ్రతకు తోడు బస్టాండ్‌లో ఫ్యాన్లు తిరగకపోవడం, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్న తీరును 'తెలంగాణ చౌరస్తా' ప్రతినిధి క్షేత్రస్థాయి పరిశీలనతో సమగ్రంగా వెలుగులోకి తెచ్చారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు ఈ కథనాలపై సత్తుపల్లి డిపో మేనేజ్మెంట్ (డీఎం) సానుకూలంగా స్పందించారు. బస్టాండ్‌లో పాడైపోయిన ఫ్యాన్లను వెంటనే బాగు చేయిస్తామని హామీ ఇచ్చిన అధికారులు, వాటిని డిపోకు తరలించి యుద్ధప్రాతిపదికన రిపేర్ చేయించారు. అనంతరం ఆ ఫ్యాన్లను తిరిగి బస్టాండ్‌లో యథావిధిగా అమర్చి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చారు. అలాగే తాగునీటి సమస్యను కూడా పరిష్కరించారు. బస్టాండ్ సమస్యలపై పత్రికలో వచ్చిన కథనానికి ప్రాధాన్యతనిచ్చి, తక్షణమే స్పందించి ప్రయాణికులకు ఉపశమనం కలిగించిన సత్తుపల్లి డిపో మేనేజ్మెంట్ కు 'తెలంగాణ చౌరస్తా' రిపోర్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో 'తెలంగాణ చౌరస్తా' దినపత్రిక ఎప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. తమ సమస్యను పరిష్కరించిన అధికారులకు, ఇందుకు కారణమైన పత్రికా యాజమాన్యానికి స్థానిక ప్రజలు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# జాతీయ స్థాయిలో శ్రీలతకు కాంస్య పతకం

- ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్
- యోగాసన పోటీల్లో మెరిసిన తెలంగాణ పోలీస్
- తెలంగాణ రాష్ట్ర నుండి ఎన్నికైన ఏకైక అథ్లెట్
- రామగుండం కమిషనరేట్, కమాన్‌పూర్ పోలీసుల హర్షం

**కమాన్‌పూర్ తెలంగాణ చౌరస్తా:**



హర్యానాలోని కర్నాల్ మధుబన్, వచ్చేర్ స్టేడియం లో మే 23 నుండి 27 వరకు ఘనంగా జరిగిన 3వ ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ యోగాసన పోటీలలో తెలంగాణ పోలీస్ విభాగానికి చెందిన కమాన్‌పూర్ పోలీస్ స్టేషన్ (రామగుండం పోలీస్ కమిషనరేట్, గోదావరిఖని సబ్ డివిజన్) మహిళా కానిస్టేబుల్ శ్రీలత కూరపాటి అద్భుత ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించారు. ఈ జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపికైన ఏకైక అథ్లెట్ శ్రీలత కావడం విశేషం. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులతో హోరాహోరీగా తలపడి, యోగాసన విభాగంలో మూడవ స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్ర కీర్తి పతాకాన్ని జాతీయ స్థాయిలో ఎగరవేశారు. గతంలో సైబరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలోనూ శ్రీలత పలు బహుమతులు గెలుచుకున్నారు. జాతీయ స్థాయిలో కాంస్య పతకంతో మెరిసిన పి.సి శ్రీలతను రామగుండం పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు, కమాన్‌పూర్ ఎస్సై , సహచర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. ఆమె చూపిన ప్రతిభ, క్రమశిక్షణ యువతకు, తోటి పోలీస్ సిబ్బందికి ఎంతో ఆదర్శప్రాయమని కొనియాడారు.

# విద్యార్థుల వివరాలు ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వొద్దు

- తల్లిదండ్రుల పేర్లు, ఫోన్ నెంబర్లు గోప్యంగా ఉంచాలి
- ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- పాఠశాల విద్యాశాఖ ఆదేశం

**తెలంగాణ చౌరస్తా, హైదరాబాద్:**



రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు,తల్లిదండ్రుల వివరాలను అనధికారిక వ్యక్తులు, ప్రైవేట్ సంస్థలకు ఇవ్వొద్దని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పేర్లు, ఫోన్ నెంబర్లు, ఇతర వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచాలని ఆర్‌జేడీలు, డీఈఓలు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు. నిబంధనల మేరకు అధికారిక అవసరాల్లో మాత్రమే వినియోగించాలని, ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల వివరాలు ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల చేతుల్లోకి వెళ్లడం.. వారు తమ కళాశాలల్లో చేరమని నిత్యం ఫోన్లు చేసి వేధిస్తున్న క్రమంలో ఈ ఆదేశాలు ఇచ్చినట్లు భావిస్తున్నారు.











# 108 సిబ్బంది ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,తెలంగాణ చౌరస్తా:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ప్రాంగణంలో 108 సిబ్బంది మానవత్వాన్ని చాటుకున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు ప్రజల దాహార్తిని తీర్చడానికి 108 సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి 108 జిల్లా కోఆర్డినేటర్ సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ... ప్రస్తుత వేసవి తీవ్రతను, ఎండల వేడిని దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రికి వచ్చే ప్రజలకు చల్లని తాగునీరు అందించాలనే సత్సంకల్పంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర సేవల్లో ఎల్లప్పుడూ ముందుండే 108 సిబ్బంది, ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో 108 పైలట్ సిబ్బంది రామిశెట్టి నరేందర్ కుమార్, లక్ష్మణ్, ప్రవీణ్, సాయి, వెంకట్, తరుణ్ ఇతర సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

- గుండ్లసింగారం వద్ద హై లెవెల్ బ్రిడ్జికి ఎమ్మెల్యే శంకుస్థాపన
- రూ.13 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణం
- పాత బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో ప్రజలకు ఇబ్బందులు
- కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సహకారంతో బ్రిడ్జి మంజూరు
- పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం
- ప్రజాప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన

**నూతనకల్ తెలంగాణ చౌరస్తా:**

ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని యడవల్లి ఆవాస గ్రామం గుండ్ల సింగారం వద్ద పాలేరు వాగుపై రూ.13 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సూర్యాపేట-నూతనకల్-దంతాలపల్లి ప్రధాన రహదారి పై దాదాపు 70 సంవత్సరాల క్రితం నిర్మించిన పాత బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. వర్షాకాలంలో నీరు బ్రిడ్జిపై ప్రవహించడం, స్లాబ్ పెచ్చులు ఊడిపోవడం వల్ల ప్రజలు భయంతో ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు & భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి వారు సహకరించారని తెలిపారు. ఇందుకు నియోజకవర్గ ప్రజల తరఫున మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు ఈ రహదారి ప్రధాన మార్గమని, ప్రజల రవాణాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి కార్యకర్తలు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పని చేయడమే కాకుండా, ఆ పనుల ఫలితాలను ప్రజలకు వివరించినప్పుడు ప్రభుత్వంపై ప్రజల్లో గౌరవం పెరుగుతుందని అన్నారు.అనంతరం తెలంగాణ ఉద్యమంలో తనతో పాటు పనిచేసిన సహచరుడు తీగల మల్లారెడ్డిని ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.




ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి,వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పిఏసిఎస్ చైర్పర్సన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి,తుంగతుర్తి పిఏసిఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పసుల అశోక్ యాదవ్, తుంగతుర్తి సేవాదళ్ అధ్యక్షులు పాల్వాయి నాగరాజు, టిపిసిసి సోషల్ మీడియా కోఆర్డినేటర్ బోల్క సైదులు యాదవ్ ,సర్పంచులు జటంగి సరిత కృష్ణ యాదవ్, గుగులోతు కృష్ణ నాయక్,అనంతుల శ్రీనివాస్,పాండవుల లింగన్న, మండల ప్రధాన కార్యదర్శి బంటు బద్రి,జిల్లా నాయకులు కట్ట మల్లారెడ్డి,దరిపల్లి వీరన్న, ఎలిమినేటి కృష్ణ ప్రశాంత్, నకిరేకంటి వెంకన్న,గుణగంటి వెంకన్న,ఇరుగు కిరణ్ కుమార్, తహసిల్దార్ శ్రీనివాసరావు,ఎంపీడీవో సునీత, ఈ ఈ,డి ఈ, ఏఈలు, ఆయా శాఖల అధికారులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# అండర్ బ్రిడ్జి పనుల పరిశీలన

- ఓదెల సర్పంచ్ కనికిరెడ్డి సతీష్

**ఓదెల, తెలంగాణ చౌరస్తా:**

ఓదెల అండర్ బ్రిడ్జి వద్ద బైపాస్ రహదారులను గ్రామ ప్రజలకు ఇబ్బందులు లేకుండా కొమిర నుండి వచ్చే ప్రజలకు,స్టేషన్ నుండి వచ్చే ప్రజలకు,పోత్కపల్లి నుండి వచ్చే ప్రజలకు అండర్ బ్రిడ్జి ప్రక్కనుండి ఓదెలకు రోడ్ సౌకర్యం ఉండేవిధంగా గతంలోనే రైల్వే అధికారులతో గ్రామ సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ మాట్లాడడం జరిగింది.రైల్వే ఎడిఎన్ శ్రీవాస్తవ ఐఎల్ డబ్ల్యూ లోకేష్ కుమార్ వేస్తామని గ్రామ పంచాయతీకి ముందస్తు సమాచారం ఇవ్వడం జరిగింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అండర్ బ్రిడ్జి తో పాటు ప్రక్కనుండి ఓదెలకు రోడ్ సౌకర్యం కూడా ఉంటుందని ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఓదెల సర్పంచ్ సతీష్,రైల్వే అధికారులతో ప్రతిక్షణం మాట్లాడుతూ.... గతంలో లాగా అండర్ బ్రిడ్జిలో నీరు నిల్వ ఉండకూడదని,అండర్ బ్రిడ్జి ప్రక్క నుండి ఓదెల గ్రామానికి కనెక్టివిటీ రోడ్లు ఉండాలన్నారు.ఈ సందర్భంగా ఓదెల గ్రామ సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ మాట్లాడుతూ.... రైల్వే అధికారులతో నిత్యం అందుబాటులో ఉంటూ గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా



అండర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రక్క నుండి రోడ్ సౌకర్యం ఉండాలని మొదటి నుండే సూచనలు చేశామని, ప్రక్కన రోడ్ సౌకర్యం లేకపోతే ఈ బ్రిడ్జి అవసరం లేదని అధికారులకు సూచించడం జరిగిందని,రైల్వే అధికారులు కూడా బ్రిడ్జితో పాటు ప్రక్కన రోడ్ కూడా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనికిరెడ్డి సతీష్,కార్యదర్శి వెంకట లక్ష్మణ్,ఎడిఎన్ శ్రీవాస్తవ,ఐఎల్ డబ్ల్యూ లోకేష్ కుమార్,ఇంచార్జీ చారి,వార్డ్ సభ్యులు గొర్ల శ్రీనివాస్,కొండ్ర లక్ష్మణ్,రాపెల్లి రాజయ్య,చింతం స్వామి,గోపతి ప్రవీణ్,బుద్ధ రవి, పెండం ఓదెలు,మాటేటి సతీష్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



# మొక్కజొన్నల దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి

- అధికారులను ఆదేశించిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు

**కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ లోని మొక్కజొన్నల దిగుమతి గోదాం ను బుధవారం ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.గోదాం లో చెడిపోయిన 20 వేల గన్ని సంచులను తొలగించి మొక్కజొన్నల దిగుమతికి మరింత స్థలం కేటాయించాలని ఫోన్లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కి ఎమ్మెల్యే విజయరమణ రావు ఆదేశించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, మాట్లాడుతూ...రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మార్కెట్ యార్డుకు వస్తున్న మొక్కజొన్నల దిగుమతి ప్రక్రియను అధికారులు మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. గోదాములో నిరుపయోగంగా, చెడిపోయి ఉన్న సుమారు 20 వేల సంచులను వెంటనే అక్కడి నుండి తొలగించాలని, తద్వారా కొత్తగా వచ్చే మొక్కజొన్నల నిల్వకు మరింత స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో రైతులు తెచ్చిన మొక్కజొన్నలు తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మార్కెట్ యార్డుల్లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను కోరారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో అధికారులు, సిబ్బంది అలసత్వం వహించకుండా, ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంటూ కొనుగోలు ప్రక్రియను సజావుగా సాగేలా చూడాలని హెచ్చరించారు. ప్రతిపక్షాల కల్లబొల్లి అసత్యపు మాటలను ఎవ్వరూ నమ్మవద్దని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు,సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రం రెడ్డి, సర్పంచ్ బంగారి రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజనవేణ సదయ్య, ఉప సర్పంచ్ గోలి సుధాకర్,మాజీ మాదాసి సతీష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సొన్నాయి టెంకం శివ రామకృష్ణ,నాయకులు సురేష్,శ్యామ్,గోవర్ధన్ , రైతులు ,తదితరులు, పాల్గొన్నారు.



# తడిసిన ధాన్యమూ కొంటాం

- ధాన్యం పట్ల రైతులు ఆందోళన చెందొద్దు
- తడి ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తాం
- రైతులకు ఎలాంటి నష్టం జరగదు
- ఏపూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట, తెలంగాణ చౌరస్తా:**

అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యం పట్ల రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. తడి ధాన్యాన్ని వెంటనే గుర్తించి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తామని, రైతులకు ఎలాంటి నష్టం జరగనివ్వబోమని స్పష్టం చేశారు. బుధవారం కలెక్టర్ తేజస్, ఎస్పీ కే. నరసింహతో కలిసి ఆత్మకూరు(ఎస్) మండలంలోని పివైఆర్ రైస్ మిల్లు, ఏపూరు గ్రామ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. కొనుగోళ్ల తీరు, తూకాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.ధాన్యం సేకరణలో లారీల కొరత, హమాలీల ఇబ్బందులు, మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యం వంటి సమస్యలు ఉన్నాయని కలెక్టర్ గుర్తించారు. వాటి పరిష్కారానికి పోలీసు, రవాణా శాఖల సమన్వయంతో అన్ని రకాల వాహనాలను రవాణాకు మళ్లిస్తున్నామన్నారు. ప్రతి రైస్ మిల్లుకు ప్రత్యేక ఇన్‌ఛార్జ్, అదనపు హమాలీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యమైతే సంబంధిత మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్ శాఖలు సమన్వయంతో ధాన్యం సేకరణ వేగంగా పూర్తి చేయాలని, రైతులకు ఇబ్బందులు రాకుండా కోఆర్డినేటర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో డిఆర్డిఓ సన్యాసయ్య, ఆత్మకూరు(ఎస్) తహసిల్దార్ హామీన్ సింగ్, ఎంపీడీవో అసీం అలీ, ఏవో దివ్య పాల్గొన్నారు.

# ఎస్సీలను అవమానించిన వారిపై చర్యలు లేవి ?

- వారిని అరెస్ట్ చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటి
- పెగడపల్లి కుల వివక్ష ఘటనపై దళిత సంఘాల నాయకుల ఆగ్రహం
- పోలీసులు,నాయకులపై అనుమానం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

**కాల్వశ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**





దళిత వర్గాలైన ఎస్సీ మాదిగ కులస్తులను ఎల్లమ్మ దేవాలయ ప్రవేశం నిరాకరించి,దూషించి అవమానపరిచిన గౌడ కులస్తులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వారం రోజులు దాటినా,ఇప్పటివరకు వారిని అరెస్టు చేయకపోవడంలో గల ఆంతర్యం ఏమిటని దళిత సంఘాల నాయకులతోపాటు మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.వెంటనే వారిని అరెస్ట్ చేసి, రిమాండుకు పంపించాలని వారు డిమాండ్ చేశారు.సంఘటనకు సంబంధించి త్వరితగతిన విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో తాత్సారం చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.మంగళవారం పెగడపల్లి గ్రామాన్ని సందర్శించిన మూఢనమ్మకాల నిర్మూలన సంఘం జాతీయ అధ్యక్షుడు (ఎంఎన్ఎస్) నాస్తిక వాది, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ బైరి నరేష్ సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కుల వివక్షత ఘటనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, రాజకీయ నాయకులు కేసును తప్పుదారి పట్టించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. చట్ట ప్రకారం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో విషయంలో 24 గంటల్లోగా విచారణ చేసి,నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపించాలని నిబంధనలు ఉన్నప్పటికీ,పెగడపల్లి కుల వివక్షత విషయంలో చట్ట ప్రకారం కేసు ముందుకు సాగడం లేదని బైరి నరేష్ ఆరోపించారు.సంఘటన జరిగి వారం రోజులు దాటినప్పటికీ,ఎస్సీ,ఎస్టీ,ప్రజాప్రతినిధులు,నాయకులు,మంత్రులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఆధునిక కాలంలో కూడా మనువాద సంస్కృతి పోకడలు ఉండడం విచారకరమన్నారు.ఈ కేసు విషయంలో కొందరు రాజకీయ నాయకులు గౌడ కులస్తుల పక్షాన చేరి ఈ కేసును నీరు కార్చే ప్రయత్నం చేస్తున్నారని పలువురు అనుమానిస్తున్నారు.చాలా సంవత్సరాలుగా అన్నదమ్ముల్లాగా కలిసిమెలిసి ఉంటున్న ఈ రెండు కులాల మధ్య కొందరు నాయకులు చిచ్చు పెట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని,అందులో భాగంగానే ఇప్పుడు ఇరుకులాల మధ్య సయోధ్య కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.ఎస్సీ కులస్తులకు ఒక్కొక్కరికి 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు డబ్బులు ఇచ్చి కేసు విత్ డ్రా చేయడానికి వారు ప్రయత్నిస్తున్నట్లు పలువురు చెప్పుకుంటున్నారు. అందు కోసమే కేసును ఆలస్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి,వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని,ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు కోరుతున్నారు.



# రైతాంగానికి బిజెపి వెన్నుపోటు

- అలుగుబెల్లి వెంకట్ రెడ్డి ఏఐకేఎంఎస్

**-తెలంగాణ చౌరస్తా, ఆత్మకూరు:**

ఆత్మకూర్ ఎస్ మండల పరిధిలోని తుమ్మల పెంపహాడులో బుధవారం నాడు అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సంయుక్త కిసాన్ మోర్చా ( ఎస్ కె ఎం ) జాతీయ కమిటీ పిలుపుమేరకు ఎం ఎస్ పి ఆర్డర్ పతులను దగధం చేశారు .ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కార్యదర్శి అలుగుబెల్లి వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేక విధానాలను అనుసరించి వ్యవసాయ రంగాన్ని దివాలా తీస్తుందని అన్నారు 14 రకాల ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరలను పెంచడానికి ఎన్నికల సమయంలో హామీ తుంగలో తొక్కిందని ఎద్దేవా చేశారురైతాంగం దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేసినప్పటికీ రైతుల గోసను పరిణంలోకి తీసుకోకుండా కంటి తుడుపు ఇప్పుడు చర్యగా నామమాత్ర పెంచుతూ నిర్ణయం చేయడం అంటేనే రైతాంగాన్ని పూర్తిగా సంక్షోభంలోనికి నెట్టడమేనని అన్నారు విత్తనాలు రసాయన ఎరువులు పురుగు మందులు కూలీల వేతనాలు డిజిల్ విద్యుత్ సాగునీరు మొదలైన ఉత్పత్తి కారకాల ధరలు ఆకాశాన్నంటుతున్న ఎం ఎస్ పి ఎ2+fl ప్రకారం ధరలు నిర్ణయించడం ప్రభుత్వ అసమర్ధతకు నిదర్శనం అన్నారు ప్రభుత్వం ప్రకటించిన ఎం ఎస్ పి కి రైతులు పెట్టిన పెట్టుబడులకు ఏమాత్రం సరిపోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు తెలంగాణ రాష్ట్రంలో పండించే సాధారణ ఏ గ్రేడ్ వరి పంటలకు 72 రూపాయలు మొక్కజొన్న 10 పత్తి 557 పెసల్లు 12 రూ" లు మాత్రమే పెంచడం వ్యవసాయరంగాన్ని దెబ్బతీయడమేనని అన్నారు.ప్రభుత్వం అమెరికా డబ్ల్యూటీవో ఒత్తిడికి తలొగ్గి వ్యవసాయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాన్ని తొలగించడం వలన అన్ని రకాల పంటల ఉత్పత్తులు ప్రమాదంలో పడ్డాయని అన్నారు ఇప్పటికే రైతులు కూలీలు చేసిన అప్పులు తీర్చలేక పండించిన పంటలకు ధరలు లేక రోజుకు 173 మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు అన్నారు ఇలాంటి పరిస్థితుల్లో ఎమ్మెస్ స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని కనీస మద్దతు ధర కల్పిస్తూ ఎమ్మెస్ పి చట్టం చేయాలని రైతంగం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు రైతే దేశానికి వెన్నుముకంటూనే రైతుకు వెన్నుపోటు పొడిచే మోడీ ప్రభుత్వం ఫాసిస్ట్ విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు..ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టు యు జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు పి వై ఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి కంచర్ల నర్సక్క కళంచెర్ల లింగయ్య పిట్టల లింగయ్య కొరివి వెంకన్న సంఘం వీరయ్య అల్లి వీరయ్య బల్క బక్క మేకల వీరయ్య తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో ఈర్ల సమ్మయ్యకు సన్మానం

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కరీంనగర్ కళాభారతిలో జరిగిన రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన పెద్దపెల్లి జిల్లా, కాల్వ శ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్యకు ఘన సన్మానం జరిగింది.ఈనెల 26న తెలంగాణ రాష్ట్ర స్థాయి లఘు చిత్ర నిర్మాతల మండలి ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు,కళాకారుడు కనపర్తి శ్రీనివాస్ నేతృత్వంలో రాష్ట్రస్థాయి పాటల పోటీలు జరిగాయి.ఇందులో బహు భాషా గాయకుడు డాక్టర్ కె.జె ఏసుదాసు పాటలపై రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో పాల్గొన్న ఈర్ల సమ్మయ్యను నిర్వాహకులు శాలువా,జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేసి ఘనంగా సన్మానించారు.రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో పాల్గొనడం గొప్ప అనుభూతిని మిగిల్చిందని ఈర్ల సమ్మయ్య తెలిపారు.

